# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## మూడు గంటల కరెంటుతో పంటలు ఎండిపోయినయ్..



ఖానాపూర్ రూరల్, నవంబర్ 27 : నాకు సత్తనపల్లి గ్రామ శివారులో ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. పూర్తిగా కరెంట్ మోటరు ద్వారానే పారకం పెడతా. కాంగ్రెస్ పార్టీ పాలనలో మూడు గంటల కరెంట్ ఇచ్చేటోళ్లు. రాత్రంత ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని మోటరు పారకం చేస్తుంటిమి. అంత కష్టపడ్డా మూడు గంటల కరెంట్ సరిపోక సగం పొలం ఎండిపోతుండే. కాంగ్రెస్ పాలనలో సాగులో నష్టాలు వచ్చి నష్ట పోయినం. మా దగ్గరికి కాంగ్రెసోళ్లు అవకాశం ఇవ్వండని వస్తే మీ పాలనలో ఏం చేశారని బరాబర్ అడుగుతం. కాంగ్రెసోళ్లకు ఎట్టి పరిస్థితుల్లో కూడా అవకాశం ఇవ్వం. 24 గంటల కరెంటు ఇచ్చి సాగును పండుగలా మార్చిన బీఆర్ఎస్‌కే మద్దతిస్తం.

**- లెక్కల రాజ్‌కుమార్, రైతు, సత్తనపల్లి.**

## కాంగ్రెస్‌ను రైతులు నమ్మరు..



లోకేశ్వరం, నవంబర్ 27 : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మాయమాటలతో రైతులను మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో నాయకులు తెలంగాణను చీకటి మయం చేశారు. కరెంటు ఎప్పుడు వచ్చేది ఎవరికీ తెలియకపోతుండే. కరెంటు కోసం రాత్రింబవళ్లు పొలాల వద్ద కాపు కాసిన రోజులు ఇప్పటికీ మరిచిపోలేం. వారు గతంలో చేసిందేట్లో అందరికీ తెలుసు. మళ్లీ ఏదో చేస్తామంటే రైతులు నమ్మె స్థితిలో లేరు. రేవంత్ రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలు అని 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలంటున్నారు. 3 గంటల్లో రైతులందరూ 10 హెచ్‌పీ మోటరు ఆన్ చేస్తే లోడ్ పెరిగి మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయన్న సంగతి కూడా అతడికి తెలియదు. ఆయనకు వ్యవసాయంపై అవగాహన లేదు. వాళ్లకు ఓటు వేస్తే రైతులంతా ఆగమవుతారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు అవసరం. మళ్లీ బీఆర్ఎస్ సర్కారే రావాలే. ప్రజలు ఆదరిస్తారు.

**- తెడ్డు మహేశ్, రాయపూర్ కాండ్లి(లోకేశ్వరం)**

## 'బోర్'మంటయ్..



లోకేశ్వరం, నవంబర్ 27 : కాంగ్రెస్ హయాంలో కరెంటు కోతలతో సానా బాధపడ్డం. బావుల్లో నీరున్నా ఎకరం, రెండెకరాలు పారుడే కష్టముండే. కేసీఆర్ సార్ 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తున్నడు. 5 హెచ్‌పీ మోటరుతో నీరు పారిస్తున్న. కాంగ్రెస్ నాయకులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటున్నరు. ఇది సాధ్యమయ్యే పని కాదు. ఖర్చెక్కువ. బావుల్లో నీరు అడుగంటుతది. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే గోదాట్లో పడుతం. ఏమైనా 'పవర్' వస్తదా.. చస్తదా.. వాళ్లవి వట్టి గాలి మాటలే.. పవర్ కష్టాలు మళ్లీ మొదలైతయ్. నేను కేసీఆర్ సార్‌కే మద్దతిస్తా. ఆయనతోనే వెలుగు జిలుగులు సాధ్యం.

**- మగ్గిడి భోజారెడ్డి, ధర్మోరా, లోకేశ్వరం మండలం.**

## 10 హెచ్‌పీ మోటర్‌కు లక్ష అవుతాయ్..



పెంబి, నవంబర్ 27 : ఇప్పుడు కేసీఆర్ ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో రెండు పంటలు పండించుకుంటున్నం. సాగు గురించి తెలియని కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ చాలంటున్నరు. మూడు గంటల కరెంటు ఇస్తే ఒక్క పంట కూడా పండదు. 10 హెచ్‌పీ మోటర్‌తో రెండు, మూడు గంటల్లో నీరందించవచ్చంటున్నారు. ఇది ఆచరణలో సాధ్యం కాదు. ఇప్పటివరకు వాడుతున్నవి కేవలం మూడు, ఐదు హెచ్‌పీ మోటర్లే. 10 హెచ్‌పీ మోటార్లనేవి ఇప్పటి వరకు తెలియదు. 10 హెచ్‌పీ మోటర్లు ఉపయోగించాలంటే సెపరేట్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్టాటర్లు, కేబుల్స్ అవసరం. అలాగే రైతు 10 హెచ్‌పీ మోటర్ కొనుగోలు చేయాలంటే రూ.60 వేల నుంచి రూ.80 వేల ఖర్చవుతది.

**- పుప్పాల రాజేందర్, రైతు, పెంబి.**

## కాంగ్రెసోళ్లకు సోయి లేదు..



లోకేశ్వరం, నవంబర్, 24 : 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయమా.. ! అది ఎట్ల సాధ్యం. కాంగ్రెసోళ్లకు సోయి లేదు.. సోయి లేని మాటలు చెబుతూ రైతుల చెవుల్లో పూలు పెడుతున్నారు. 10 హెచ్‌పీ మోటార్లు వాడితే కరెంటు ఎంత కాలుద్ది... పాత బోర్లు తీసి కొత్త బోర్లు వేయాలా.. 10 హెచ్‌పీ మోటర్లతో బోర్లలో నీళ్లుంటాయా. పైపులు ఎక్కడికక్కడ పగిలిపోతాయి. కరెంటు తీగలు కాలిపోతాయి. కరెంటు వాడకం పెరిగిపోతుంది. పొలాలు ఎండి పోతాయి. కాంగ్రెస్ నాయకులు రేవంత్ రెడ్డికి కరెంటు గురించి తెలియనట్లుంది. ఇప్పుడు సీఎం కేసీఆర్ 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తున్నారు. రైతులు సంబురంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. రైతులు బాగుపడడం ఇష్టం లేకనే కాంగ్రెస్ మూడు గంటల కరెంటు ఇస్తానంటుంది. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వాత పెడుతాం. బీఆర్ఎస్ సర్కారే ఉండాలే.

**- జే కిషన్ పటేల్, రాయపూర్ కాండ్లి, (లోకేశ్వరం)**

## బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండాలే..



నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 27 : నాకు రెండు ఎకరాల వ్యవసాయం ఉంది. పత్తి, పసుపు పంటలు సాగుచేస్తున్నా. కాంగ్రెస్ పాలనలో కరెంటు కోసం గోస పడ్డాం. రాత్రి పూట పొలాల వద్దే పడిగాపులు కాసేటోళ్లం. ఇప్పుడు బాధలు తీరాయి. అవసరం ఉన్నప్పుడల్లా తోటకు నీళ్లు కట్టి సాగుచేసుకుంటున్నాం. రైతులు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుతో ఎంతో సంతోషంగా ఉన్నారు. పంటలకు మూడుగంటలు కరెంటు వద్దు 24 గంటలు కరెంట్ ఇచ్చే ప్రభుత్వమే కావాలి.

**- కంచాని పెద్దమల్లు రైతు, పోతారం**

# మూడు గంటలతో పంటలెలా?

## 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవా?

- కాంగ్రెస్‌పై రైతుల మండిపాటు
- ఆ పార్టీని నమ్మి కష్టాలు కొనితెచ్చుకోలేమని స్పష్టం
- సీఎం కేసీఆర్ వెంటే నడుస్తామని అభిప్రాయం

**కాంగ్రెస్ పార్టీ ఇస్తామంటున్న మూడు గంటల కరెంటుతో పంటలెలా పండుతయని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కరెంటుకోసం ముప్పతిప్పలు పడ్డామని, అహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటలు చేతికివచ్చే దశలో కరెంటు లేక ఎండిపోయేవని గుర్తు చేసుకొని బాధపడుతున్నారు. టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటలు కరెంటు సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెప్పడం రైతులను మోసం చేయడమేనని మండిపడుతున్నారు. 10 హెచ్‌పీ మోటార్ల వల్ల ఓవర్‌లోడ్ పడి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడమే కాకుండా భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, పంటలకు నీరు అందించలేని దుస్థితి వస్తుందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల ఉచిత కరెంటును అందిస్తున్నారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చారని కొనియాడుతున్నారు. కాంగ్రెస్‌ను నమ్మి తిరిగి కరెంటు కష్టాలను కొని తెచ్చుకునే పరిస్థితుల్లో లేమని, రైతుబిడ్డ కేసీఆర్ వెంటే నడుస్తామని స్పష్టం చేస్తున్నారు.**

**- నిర్మల్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)**

## మూడు గంటల కరెంటు సరిపోదు..



ముథోల్, నవంబర్ 27 : వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోదు. ఏ అవగాహనతో కాంగ్రెస్ నాయకులు ఈ విధంగా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంటుతోనే రైతు నిబ్బరంగా చేలకు నీరందిస్తూ రాత్రి కంటినిండా కునుకు తీస్తున్నాడు. కాంగ్రెసొస్తే మళ్లీ కరెంటు కష్టాలు తప్పవు. ఏ రైతు కూడా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోలేడు. ముథోల్ మండల ప్రాంతంలో 3, 5 హెచ్‌పీ మోటర్లనే వాడుతరు. కాంగ్రెస్ పార్టీ 10 హెచ్‌పీ మోటర్లను తెరపైకి తేవడం వాళ్ల తెలివి తక్కువ తనానికి నిదర్శనం.

**- అభిమన్యు, రైతు, ముథోల్.**

## మూడు గంటల కరెంటంటే మోసమే..



సోన్, నవంబర్ 27 : నేను 30 ఏళ్ల సంది ఎవుసం జేస్తన్నా. కాంగ్రె సోళ్లు ఉన్నప్పుడు ఏడు గంటల కరెంటు ఉండే. పగటీలి రెండు గంటలు. రాత్రీళ్లు మూడు గం టలు ఇచ్చేటోళ్లు. చేలకు నీరు పెట్టేందుకు చీకట్లో పోతే పాములు, తేళ్లు కరిచేవి. గిప్పుడు ఆ పరిస్థితి లేదు. కేసీఆర్ సారు 24 గంటల కరెంటు ఇస్తున్నడు. సాయంత్రం మోటరు చాలు చేసేస్తో తెల్లారేసరికి పొలమంతా నీరు పారు తంది. గిప్పుడు కాంగ్రెసోళ్లు మళ్లీ మూడు గంటల కరెంటు అంటూ రైతులను మోయం చేయడానికి వస్తున్నడు. జాగ్రత్తగా ఉండాలి.

**- కొప్పుల నర్సయ్య, రైతు, వెంగ్వాపేట్.**

## 24గంటల కరెంటే ముద్దు..



నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 27 : నాకు పది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. బోరుద్వారా పంటలు సాగు చేస్తున్నా. వ్యవసాయాన్నే నమ్ముకొని బతుకుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడు కరెంటు వస్తుందో తెలియదు. చాలీచాలని కరెంటుతో పంటలు ఎండిపోయేవి. వ్యవసాయం చేయాలంటే అనేక సమస్యలుండేవి. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమానికి కృషి చేస్తుండు. ప్రస్తుతం 24 గంటలు విద్యుత్ ఇవ్వడం వల్ల చింతలేని జీవితం గడుపుతున్నాం. సీఎం కేసీఆర్ సార్‌కు వ్యవసాయం అంటే చాల ఇష్టం. 24 గంటలు ఇవ్వడం వల్ల సంబురంగా పంటలు సాగు చేసుకుంటున్నాం. ఇష్టమచ్చిన సమయంలో పంటలకు నీరు పారించుకుంటున్నాం. మూడు గంటలు వద్దు.. 24 గంటల కరెంటే కావాలే. ఇది బీఆర్ఎస్‌తోనే సాధ్యం.

**- రాథోడ్ గణేశ్, పరిమండల్**

## పదేండ్లు వెనక్కి పోతం..



భైంసా టౌన్, నవంబర్ 27 : నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా మూడు గంటల కరెంటిస్తే మూడు రోజులైనా నా పొలానికి నీళ్లు పారవు. ఒకవైపు పారిస్తే ఇంకోవైపు ఎండిపోతది. దిగుబడి కూడా బాగా తగ్గుతది. కాంగ్రెసోళ్లు మా వద్దకు వచ్చి కష్టాలు, సుఖాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తే మేము ఎట్లున్నమో తెలిసేది. ఇలా రైతు వ్యతిరేక ప్రకటనలు చేసేటోళ్లు కాదు. కాంగ్రెస్ పార్టీకి అవకాశమిస్తే రాష్ట్రం మరో పదేండ్లు వెనక్కి పోవడం ఖాయం. ఉద్యమ నాయకుడు, సీఎం కేసీఆర్ సార్ ఇస్తున్న కరెంటే బాగుంది. మళ్లీ ఆయనొస్తేనే ఈ కరెంటు ఉంటది. లేకపోతే చీకట్లు కమ్ముకుంటయ్.

**- దిగంబర్, రైతు, చుచుంద్.**

## ఏండ్ల తరబడి తిరిగేది..



సారంగాపూర్, నవంబర్ 27 : కాంగ్రెస్‌కు అవకాశమిస్తే పట్వారీ వ్యవస్థ మొదలైతది. వాళ్ల చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోవాల్సి వస్తది. కార్యాలయాల చుట్టూ ఏండ్ల తరబడి తిరిగినా పని కాకపోయేది. కొన్ని సందర్భాలలో డబ్బులిచ్చినా పని కాకపోయేది. సీఎం కేసీఆర్ సారు ధరణి తీసుకొచ్చినంక పట్టాలు సులువుగా, వేగంగా అవుతున్నాయి. తిరుగుడు తప్పి పదిహేను నిమిషాలలోనే పని అవుతున్నది. ఒక వేళ అత్యవసర పనిపడితే భూమిని అమ్ముకోవాలన్నా.. 20 నిమిషాల్లోనే భూమిని అమ్ముకోవచ్చు. **- సంపెంగల గంగన్న, రైతు, పొట్యా**

## అవకతవకలకు ఆస్కారం



భైంసా టౌన్, నవంబర్ 27 : రైతన్నల బాధలు చూసిన సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిండు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుడు బాధను తప్పించిండు. గిప్పుడు నిమిషాల వ్యవధిలో కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతున్నయ్. ధరణిని రద్దు చేస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నరు. వారికి కనీస అవగాహన లేదు. మళ్లీ పాత పద్ధతి వస్తే లంచగొండులు, దళారులు పెరిగిపోతరు. పైసలిస్తేనే ఫైలు కదిలే పరిస్థితి వస్తది. ఎనుకటి తీరుగా చేతితో రాసే పట్టాలై అయితే అవక తవకలకు ఆస్కారం అధికంగా ఉంటుంది. రైతులు మోసపోతరు.

**- మహ్మద్ రైసొద్దీన్, మహాగాం, భైంసా.**

## మళ్లీ పంచాయితీలు షురూ అవుతయ్..



తానూర్, నవంబర్ 27 : ధరణి పోర్టల్ రద్దయితే డిజిటల్ రికార్డులు మాయమవుతాయి. గతంలో మాదిరిగా పల్లెల్లో కొట్లాటలు, గొడవలు పెరుగుతయ్. పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతది. గొడవలు, అవమానాలు భరించలేక రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటది. గతంలో కూడా చాలా మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వ్యవస్థ చాలా బాగుంది. ధరణి తీసేస్తే దళారీ వ్యవస్థ వస్తది. ధరణి ఉండాల్సిందే. కొనడం, అమ్మడం సులువుగా ఉంటది. పారదర్శకంగా కూడా ఉంటది.

**- శ్యామ్‌రావు, సర్పంచ్, హిప్నెల్లి**

# ధరణి రద్దు పేరిట బెదిరింపులా?

- ఓటుతో తగిన గుణపాఠం చెబుతాం
- కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో వేస్తాం
- హస్తం తీరుపై అన్నదాతల ఆగ్రహం

## అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు

**ఉమ్మడి రాష్ట్రంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్యవసాయ రంగాన్ని ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేసిందని, బీఆర్ఎస్‌తోనే రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ పాలనలో భూములు ఎవరి పేరిట మారుతున్నాయో కూడా తెలియని పరిస్థితి ఉండేదని, తమకు తెలియకుండానే భూముల అమ్మకాలు, కొనుగోళ్లు జరిగేవని మండిపడుతున్నారు. పట్వారీ వ్యవస్థను తిరిగి అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తున్నదని, ఇందులో భాగంగానే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని హస్తం పార్టీ నాయకులు తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని, ఓటుతో తగిన గుణపాఠం చెబుతామంటున్నారు. కాంగ్రెస్ నాయకుల మాటల నమ్మే పరిస్థితి లేదని, వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. అదే సీఎం కేసీఆర్ భూముల వివరాలను సరిచేసి ధరణిపోర్టల్‌లో పకడ్బందీగా పొందుపర్చారని, రైతులు తమ భూ రికార్డులను సెల్‌ఫోన్ సాయంతో అరచేతిలో చూసుకునే అవకాశం కలిగిందంటున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలతో పదేళ్లుగా సంతోషంగా ఉన్నామని, ధరణిపోర్టల్‌ను రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలుపుతామని వారంతా స్పష్టం చేస్తున్నారు.**

**- నిర్మల్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)**

## డబ్బు లు ముట్ట జెప్పాల్సి వస్తది..



సోన్, నవంబర్ 27 : గతంలో భూ రికార్డులు కాగితాల్లోనే ఉంటుండే. లోకల్‌లో పని చేసే రెవెన్యూ అధికారులు భూ రికార్డులను కిందా మీద చేసి వాటిని సరిదిద్దేందుకు డబ్బులు వసూలు చేస్తుండే. రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి పహాణి కావాలంటే కొంత ముట్టనిదే వచ్చేది కాదు. గరీబోళ్ల రైతులను దగ్గరికి రానిచ్చేవారు కాదు. దీంతో మేము దళారులను, పలుకుబడి ఉన్న నాయకులను తొలుకొని వెళ్తె పని జరిగేది. కేసీఆర్ దీన్ని రూపుమాపేందుకు ధరణి తెచ్చిన్రు. ధరణి వ్యవస్థ పైరవీ వ్యవస్థ పూర్తిగా రూపుమాపింది. ఆన్‌లైన్‌లో రికార్డులు ఉండడం వల్ల మీ సేవకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే గంటలోపే భూ వివరాలు వస్తున్నాయి. ధరణి మాకు సంతృప్తిని ఇస్తున్నది. అటువంటి ధరణిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ నాయకులు సభల్లో పదేపదే చెప్తుంటే వారి భూములు కూడా ధరణి ద్వారానే భద్రంగా ఉన్నాయని గుర్తించకపోవడం దారుణం.

**- గుండారపు రాజేశ్వర్, రైతు, నీలాయిపేట్**

## లంచాల బెడద మొదలైతది..



పెంబి, నవంబర్ 27 : ధరణి పోర్టల్‌తోనే రైతులకు మేలు జరుగుతోంది. ధరణి వచ్చినప్పటి నుంచి సర్కారు కార్యాలయాల చుట్టూ తిరుగుడు తప్పింది. లంచాల బెడద పోయింది. 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అవుతున్నాయి. ధరణిని రద్దు చేస్తే రైతుల తిప్పలు మళ్లీ మొదలవుతాయి. కాంగ్రెసోళ్లు ధరణిని తీసేస్తామనడం మూర్ఖత్వమే అవుతుంది. కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ధరణి ఉండాలంటే మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలి.

**- బోసు శ్రీనివాస్, రైతు, నాగాపూర్(పెంబి)**

## డబ్బు లివ్వందే పనికాదు..



సోన్, నవంబర్ 27: వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకేటోళ్లం. తర తరాలుగా వస్తున్న భూములను మా పేరిట మార్చుకోవడానికి ధరణి బాగున్నది. గతంలో తాతల ఆస్తి తండ్రులకు ఇవ్వడానికి ముడుపులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేసేవారు. ధరణి వచ్చాక అందులోనే వివరాలు ఉండడంతో రైతుకు పహాణి, 1బీకి అవసరమైతే మీ సేవా కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే వెంటనే సర్టిఫికెట్లు వస్తున్నాయి. గిఫ్ట్ డీడీలు, వారసత్వ భూమార్పిడి దరఖాస్తు చేసుకుంటే పైసా ఖర్చు లేకుండా ఇంటికే కొత్త పాసుపుస్తకం వస్తోంది. అందులో రైతుకు సంబంధించిన భూ వివరాలు డిజిటల్ రూపంలో పొందు పరుస్తున్నారు. దళారుల వ్యవస్థ, అధికారుల వేధింపులు ధరణితో దూరమయ్యాయి. ఇప్పుడు కాంగ్రెసోళ్లు ధరణిని రద్దు చేస్తే మళ్లీ పాత రోజులే వస్తయి.

**- సీహెచ్ మహేందర్, రైతు, గంజాల్.**

## కాంగ్రెస్ గెలిచేది లేదు.. సచ్చేది లేదు..



దస్తురాబాద్, నవంబర్ 27 : ధరణితో రెవెన్యూ వ్యవస్థలో ప్రక్షాళన జరిగింది. గతంలో రెవెన్యూ రికార్డులు తారుమారయ్యేవి. నేడు ఆ పరిస్థితి లేదు. వేలిముద్రల సాయంతో క్రయ, విక్రయాలు వెంటనే జరిగిపోతున్నాయి. రిజిస్ట్రేషన్లు తహసీల్ కార్యాలయాల్లో నిమిషాల్లో జరుగుతున్నాయి. గతంలో రిజిస్ట్రేషన్ల కోసం రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కాంగ్రెస్ వచ్చేది లేదు. సచ్చేది లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ చాలా బాగుంది. పోర్టల్ ద్వారా అరగంటలో భూ రిజిస్ట్రేషన్ అవుతున్నది. 15 రోజుల్లో పాస్ బుక్ ఇంటికి వస్తుంది. నాలుగు ఓట్లు రాని కాంగ్రెస్ నేతలు ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని చెబుతున్నారు. వారినే ప్రజలు ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు రైతులకు ఆ పార్టీ ఏం మేలు చేసిందో అందరికీ తెలుసు. కాంగ్రెస్‌తో లంచాల బాధ తప్పదు. రైతులు చిన్న పహాణీ నకలు కావాలన్నా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తది. రైతులు భూ మాత పోర్టల్‌ను వ్యతిరేకించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలి.

**- బత్తుల మహేశ్, రైతు, మున్యాల**